సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
22-09-2025
పేజీలు: 02



## కాంతార చాప్టర్ 1 ట్రైలర్ విడుదల

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కన్నడ బ్లాక్‌బస్టర్ 'కాంతార' సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'కాంతార చాప్టర్ 1' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోగా, దర్శకుడిగా రిషబ్ శెట్టి మళ్లీ అదే మాంత్రిక ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల కాగా, అభిమానులను పూర్తిగా మంత్ర ముగ్దులను చేసింది. ప్రభాస్ చేతుల మీదుగా విడుదలైన ఈ ట్రైలర్‌లో "నాన్న ఎందుకు ఇక్కడే మాయమయ్యాడు?" అనే డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది. సాంకేతికంగా అత్యద్భుతంగా రూపొందిన ఈ ట్రైలర్ మొత్తం 2 నిమిషాల 56 సెకన్ల నిడివితో సాగుతుంది. గ్రాండ్ విజువల్స్, సాలిడ్ బిజీయం,షార్ప్ షాట్స్,ఇంటెన్స్ ఎమోషన్స్, ఇవి అన్నీ కలసి ట్రైలర్‌ను అద్భుతంగా మలిచాయి. నేటివిటీ టచ్ మరింతగా ఆసక్తిని రేకెత్తిస్తుండగా, కథలో ఉత్కంఠను పెంచేలా ప్రతి షాట్ రూపుదిద్దుకుంది. మేకింగ్ స్టైల్, విజువల్ నేరేషన్ అన్నీ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సారి 'కాంతార చాప్టర్ 1'ను పాన్ ఇండియా లెవెల్‌లో రిలీజ్ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలుగులో గీత ఆర్ట్స్ ద్వారా రిలీజ్ కానుండగా, నైజాం ప్రాంతంలో ప్రముఖ సంస్థ మైత్రీ ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ హక్కులను దక్కించుకుంది.

# కొత్త ధరలొచ్చేశాయ్

అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చిన జిఎస్‌టి 2.0 సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు ముందుగానే దసరా పండుగ వచ్చినట్టు అయింది. ఇప్పటి వరకు నిత్యావసర వస్తువులు, గృహోపకరాణాలపై విధించిన జిఎస్‌టిని తగ్గించడంతో తగ్గిన ధరలు ఆదివారం రాత్రి నుంచే అమలులోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో వంట గది మొదలుకొని కార్లు, టీవీలు, ఫ్రిడ్జ్, హోమ్ అప్లియన్సెస్, పాలు, -నెయ్యి, -వెన్న, జున్ను, బట్టలు, బూట్లు వరకు ప్రతి దాని వస్తువుపై ధర గణనీయంగా తగ్గింది. జిఎస్‌టి రేట్ల తగ్గింపు ప్రయోజనాలను అందించడానికి ఇప్పటికే మదర్ డైరీ, అమూల్, ఐటిసి వంటి కొన్ని కంపెనీలు ఉత్పత్తుల ధరలను తగ్గించిన విషయం తెలిసిందే. అలాగే పనీర్, నెయ్యి, సబ్బు-, షాంపూ వంటి సాధారణ నిత్య వస్తువులతో పాటు గృహోపకరణాలు ఏసీలు, వాషింగ్ మిషిన్లు, ఫ్యాన్లు, ఫ్రిడ్జీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు జిఎస్‌టి శ్లాబ్‌లో ఐదు శాతం పరిధిలోకి వచ్చాయి. జిఎస్‌టి రేట్లను మార్చ డం ద్వారా పిండి, బియ్యం, పప్పులు, పాలు, నెయ్యి, వెన్న వంటి నిత్యవసర సరుకులు కూడా చౌక ధరకు లభ్యం కానున్నాయి. కొత్త జిఎస్‌టి రేట్లతో రోజువారీ ఆహార పదార్థాలు, షాంపూలు, గృహోపకర ణాలు వంటి అనేక అవసరమైన వస్తువులు ఇకపై తక్కువ ధరలకు లభించనున్నాయి. జీవన, ఆరోగ్య బీమా సేవలపై జిఎస్‌టిని పూర్తిగా తొలగించడం విశేషం. ఈ మార్పులతో దాదాపు 375 రకాల వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ఇది ప్రధానంగా మధ్య తరగతి ప్రజలకు ఊరటనిచ్చేలా ఉన్నాయి. సామాన్యులకే



కాకుండా మధ్యతరగతి ప్రజలకు కార్లు, ఇతర వాహనాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల ఎంతో ఊరట ఇవ్వనున్నాయి. చిన్న కార్లపై జిఎస్‌టిని 18 శాతానికి తగ్గించారు. ఇప్పటికే మారుతీ, టాటా వంటి కంపెనీలు ధరలు తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి.

12 శాతం నుంచి 0 శాతానికి తగ్గించబడిన వస్తువులు
యుహెచ్‌టి మిల్క్, చీజ్ (ప్యాక్ చేసినవి), పిజ్జా బ్రెడ్, ఖాఖ్రా, చపాతీ, రోటి
కొన్ని ఔషధాలు (ఉదా: ఒనసెమ్నోజీన్ అబెపార్వోవెక్, అసిమినిబ్)
నోట్‌బుక్స్, ఎక్సర్‌సైజ్ బుక్స్, పెన్సిల్ షార్పెనర్స్, క్రయాన్స్

12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించబడిన వస్తువులు
కండెన్స్‌డ్ మిల్క్, బటర్, గీ, చీజ్
రూ. 2500 కంటే తక్కువ విలువ ఉన్న ఫుట్‌వేర్
కాటన్, జ్యూట్ హ్యాండ్ బ్యాగ్స్
వుడ్, రతన్, బాంబూ ఫర్నిచర్
కిరోసిన్ స్టవ్, లాంతర్లు, సీవింగ్ మెషీన్స్
డ్రై ఫ్రూట్స్ (బాదం, హాజెల్‌నట్స్, పిస్తా మొదలైనవి)
టెండర్ కొబ్బరి నీరు (ప్యాక్ చేసినవి)
నామ్‌కీన్, డయాబెటిక్ ఫుడ్స్
వ్యవసాయ యంత్రాలు, సౌర శక్తి పరికరాలు

18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించబడిన వస్తువులు
టాల్కమ్ పౌడర్, షాంపూ, హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్
షుగర్ కాన్ఫెక్షనరీ (మిష్టి, బతాషా మినహా)
చాక్లెట్స్, కేక్స్, బిస్కెట్స్
కాఫీ, టీ ఎక్స్‌ట్రాకట్స్
ఐస్ క్రీమ్, మినరల్ వాటర్ (స్వీటెనర్ లేనివి)


28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుదల
ఎయిర్ కండీషనర్లు, డిష్ వాషింగ్ మెషీన్స్
టెలివిజన్ సెట్లు, సెట్ టాప్ బాక్స్‌లు.

## జడ్చర్లలో కారు డివైడర్ ను ఢీకొట్టి.. మరో కారుపై పడింది: ఇద్దరు మృతి

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 44వ జాతీయ రహదారిపై రాజాపూర్ వద్ద రెండు కార్లు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. డ్రైవర్ నిద్రమత్తులో జారుకోవడంతో కారు డివైడర్ ను ఢీకొని అనంతరం మరో కారుపై ఎగిరిపడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు దుర్మరణం చెందారు. మృతులు వనపర్తి ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్రాఫిక్ జామ్ కావడంతో క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు తొలగించారు.

## కశ్మీర్ అంశాన్ని గాజాలో జరుగుతున్న యుద్ధంతో పోల్చిన పాక్ ప్రధాని

కశ్మీర్ సమస్యకు పరిష్కారం లభించకుండా భారత్‌తో సాధారణ సంబంధాలు సాధ్యమవుతాయని ఎవరైనా అనుకుంటే, అది పగటి కలలు కనడమే అవుతుందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్యసమితి సమావేశాలకు హాజరయ్యే ముందు లండన్‌లో ఆయన ప్రవాస పాకిస్థానీలతో జరిగిన ఒక సమావేశంలో మాట్లాడారు. ఇరు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొనాలంటే కశ్మీర్ అంశాన్ని తేల్చాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు."భారత్, పాకిస్థాన్ పొరుగు దేశాలు. మనం కలిసే జీవించాలి. కానీ కశ్మీరీ ప్రజల త్యాగాలు వృథా కారాదు. వారి రక్తం ప్రవహిస్తున్నంత కాలం శాంతి సాధ్యం కాదు. భారత్ సహకరించే ధోరణిలో కాకుండా యుద్ధ వైఖరితో వ్యవహరిస్తోంది"



అని షెహబాజ్ విమర్శించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడిపై అంతర్జాతీయ దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు.గతంలో భారత్‌తో జరిగిన నాలుగు యుద్ధాల వల్ల తమ దేశం బిలియన్ల కొద్దీ డాలర్లను నష్టపోయిందని షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ డబ్బును పాకిస్థాన్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేసి ఉంటే దేశం ఎంతో అభివృద్ధి చెందేదని అన్నారు. "మనం ప్రేమతో, పరస్పర గౌరవంతో జీవించాలా లేక పోరాటాలతోనే కొనసాగాలా అన్నది మన చేతుల్లోనే ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా కశ్మీర్ అంశాన్ని గాజాలో జరుగుతున్న పరిణామాలతో షెహబాజ్ పోల్చారు. గాజాలో 64 వేల మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, ఇజ్రాయెల్ దురాగతాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కశ్మీర్, గాజా రెండు సమస్యలపైనా అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. కాగా, ఉగ్రవాదం, చర్చలు ఏకకాలంలో జరగవని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.


## కీర్తి సురేశ్ స్టన్నింగ్ లుక్స్

తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే.. ఈ సామెత ఊరికే అనలేదు పెద్దలు. కీర్తి సురేష్ ఈ సామెతకు అర్థాన్ని చెప్తున్నారిప్పుడు. పెళ్లై రెండు వారాలు కూడా కాలేదు.. అప్పుడే పర్సనల్ లైఫ్‌ను పక్కనబెట్టి ప్రొఫెషనల్‌గా తాను చేయాల్సిన న్యాయం చేస్తున్నారు. ప్రస్తుతం ఈమె సోషల్ మీడియాలో బాగా ట్రెండింగ్. మరి దానికి కారణమేంటో చూద్దామా..?రెండు వారాలుగా సోషల్ మీడియాను షేక్ చేస్తూనే ఉన్నారు కీర్తి సురేష్. ఆ మధ్య బేబీ జాన్‌లో అదిరిపోయే హాట్ సాంగ్.. ఆ వెంటనే పెళ్లి న్యూస్.. వారం రోజులు ఆగి ప్రియుడితో గోవాలో పెళ్లి.. అంతలోనే ఇప్పుడు ప్రమోషన్స్.. ఇలా అస్సలు గ్యాప్ లేకుండా కుమ్మేస్తున్నారు కీర్తి.మెడలో పసుపు తాడు.. మోడ్రన్ క్యాస్ట్యూమ్స్‌తో తెగ వైరల్ అవుతున్నారు ఈ భామ. పెళ్లి కోసం వారం రోజులు మాత్రమే గ్యాప్ తీసుకున్న కీర్తి సురేష్.. వెంటనే బేబీ జాన్ ప్రమోషన్స్‌లో జాయిన్ అయిపోయారు.



## తెలంగాణకు అతి భారీ వర్ష సూచన

తెలంగాణకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు మరోసారి వర్షం హెచ్చరికలు జారీ చేశారు. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో నేటి నుంచి మరో రెండ్రోజులు భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేశారు. నేడు నల్లగొండ, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, జనగాం, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అతి భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని చెప్పారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వరదలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం వంటివి జరగవచ్చని అంచనా వేశారు. కాబట్టి ప్రజలు అనవసర ప్రయాణాలు మానుకోవాలన్నారు. వర్షం నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇక జగిత్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఆయా జిల్లాల్లో రాబోయే రెండు మూడు గంటల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఎల్లో



అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ నగరంలో సాయంత్రం తర్వాత వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆఫీసులు, ఉద్యోగాలకు వెళ్లిన వారు త్వరగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. అనవసర ప్రయాణాలు మానుకోవాలని.. అత్యవసరం అయితేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని చెప్పారు. ఇక హైదరాబాద్ నగరంలో గత కొన్ని రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం తూర్పు హైదరాబాద్ ప్రాంతంలో కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో రోడ్లు పూర్తిగా జలమయం అయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం సాయంత్రం తర్వాత కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.

## బిసిసిఐ అధ్యక్ష రేసులో మిథున్ మన్హాస్!

వచ్చే ఆదివారం భారత్ క్రికెట్ బోర్డు(బిసిసిఐ) ఎజిఎం మీటింగ్ జరగనుంది. ఈ సమావేశంలో బిసిసిఐ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. ఈ నేపథ్యంలో అధ్యక్ష రేసులో మాజీలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే తదితరుల పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ అనూహ్యంగా ఓ ఫస్ట్ క్లాస్ క్రికెట్ పేరు చర్చలోకి వచ్చింది. ఆదివారం బిసిసిఐ పెద్దలు ఈ పేరుపైనే చాలా సమయం చర్చించినట్టు తెలుస్తోంది. దేశవాలిల్లో ఢిల్లీ టీమ్‌కు సారథి అయిన మిథున్ మన్హాస్. బిసిసిఐ అధ్యక్ష రేసులో ప్రధానంగా మిథున్ పేరు వినపడుతోంది. టీమిండియాకు ఒక్క మ్యాచ్ ఆడని మిథున్.. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 157 మ్యాచ్‌లు ఆడి 9714 పరుగలు సాధించాడు. 130 లిస్ట్‌ఎ మ్యాచ్‌లు ఆడిన మన్హాస్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో సయితం 55 మ్యాచ్‌లు ఆడాడు. చైన్నై, ఢిల్లీ డేర్ డెవిల్స్, పుణె వారియర్స్‌కు ప్రాతినధ్యం వహించాడు.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## దుర్గమ్మను దర్శించుకున్న హోంమంత్రి

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నారు. తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. హోంమంత్రి వంగలపూడి అనిత దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హెంమంత్రికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. దసరా ఉత్సవ ఏర్పాట్లపై క్యూ లైన్లో భక్తులను అడిగి తెలుసుకున్నారు మంత్రి. దర్శనానంతరం హోంమంత్రి అని మీడియాతో మాట్లాడుతూ.. శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. దుర్గమ్మ దయ అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాల ఏర్పాట్లు చాలా బాగున్నాయన్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌కు శక్తి, మంచి ఆరోగ్యం ఇవ్వాలని దుర్గమ్మను కోరుకున్నట్లు చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వం మరో ౨౦ ఏళ్ల పాటు ఉండాలని దుర్గమ్మను కోరుకున్నాట్లు తెలిపారు. రాష్ట్రంపై సైకోల కళ్ళు పడకూడదని దుర్గమ్మను వేడుకున్నానని హోంమంత్రిర వంగలపూడి అనిత పేర్కొన్నారు.

## అలా జరిగి ఉంటే రాజకీయాల్లోకి వచ్చేవాడిని కాదేమో – పవన్




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కించిన చిత్రమే 'ఓజీ'. ఈ సినిమా ఈనెల ౨౫న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో 'ఓజీ కాన్సర్ట్' పేరుతో వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ''ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ లాంటి అద్భుతమైన నటుడితో కలిసి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. సుజీత్ నాకు వీరాభిమాని. 'సాహో' తర్వాత త్రివిక్రమ్ నాకు తనని పరిచయం చేశాడు. అతను కథ చెప్పే తీరు క్లుప్తంగా ఉన్నా.. దాన్ని తెరకెక్కించేటప్పుడు తనలోని సత్తా తెలుస్తుంది' అంటూ పవన్ చెప్పకొచ్చారు. పవన్ కళ్యాణ్ ఇంకా మాట్లాడుతూ.. 'ఈ చిత్ర విషయంలో ఎక్కువ క్రెడిట్ సుజీత్ కే దక్కుతుంది. అలాగే తన విజన్‌ను అద్భుతంగా ఆవిష్కరించిన మరో వ్యక్తి తమన్. ఈ సినిమాకి వీళ్లిద్దరే స్టార్లు. వీళ్లిద్దరూ సినిమా అంతా ఒక ట్రాన్స్‌లో ఉన్నారు. ఆ తర్వాత అందులోకి నన్నూ లాగేశారు. నేనొక డిప్యూటీ సీఎం అన్న సంగతే మర్చిపోయేంతలా దీంట్లో నన్ను లీనమయ్యేలా చేశారు. ఈ సినిమాలో నాకు.. ప్రియాంకకు మధ్య నడిచే ప్రేమకథ చిన్నదే అయినప్పటికీ అది చాలా హృద్యంగా ఉంటుంది. ఇక సుజీత్ లాంటి యువ దర్శక బృందం నేను దర్శకత్వం చేసిన రోజుల్లో ఉండి ఉంటే రాజకీయాల్లోకి వచ్చేవాడిని కాదేమో'' అని పవన్ కామెంట్స్ చేయడం విశేషం. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి ఈ సినిమాని నిర్మించారు. ప్రియాంక మోహన్ కథానాయిక.




## లక్ష డాలర్ల ఫీజు కొత్త దరఖాస్తుదారులకే..

హెచ్1బి వీసాకోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే లక్ష డాలర్ల వీసా రుసుము వర్తిస్తుందని అమెరికా అధికారులు శనివారం నాడు స్పష్టం చేశారు. వీసా ఫీజు పెంపుపై భయాందోళనలు రేకెత్తిస్తూ మీడియా లో కథనాల నేపథ్యంలో వైట్ హౌస్ అధికారులు ఈ వివరణ ఇచ్చారు. భారతదేశంతో సహా అమెరికాలో పని చేసేందుకు కార్మికులను నియమించుకునే కంపెనీలు చెల్లించాల్సిన వీసా ఫీజు పెంచే ప్రకటనపై ప్రెసిడెంట్ ట్రంప్ సంత కం చేసిన ఒక రోజు తర్వాత అమెరికా అధికారులు ఈ స్పష్టతను ఇచ్చారు. హెచ్ — 1బి ఫీజు పెంపు చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. కానీ, ఈ ఫీజు నిబంధనలు అమలులోకి వస్తే, నిపుణులైన ఉద్యోగులను అంతర్జాతీయ దేశాలనుంచి నియమించుకునే కంపెనీ లు. వీసాపై పనిచేసే ఏ ఉద్యోగికైనా ఆరు సంవత్సరాలవరకూ ప్రతి సంవత్స రం లక్ష అమెరికా డాలర్లు చెల్లించవలసి ఉంటుందని వైట్ హౌస్ అధికారి చె ప్పినట్లు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

## నారపల్లిలో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య..



మేడ్చల్ జిల్లా మేడిపల్లి పరిధిలోని నారపల్లిలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. అతని బలవన్మరణానికి ర్యాగింగే కారణమని స్నేహితులు ఆరోపిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన జాదవ్ సాయితేజ (౧౯) నారపల్లిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్నారు. అక్కడే ఓ హాస్టల్ ఉంటున్నాడు. ఇటీవల అతనికి సీనియర్ విద్యార్థులతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సాయితేజ హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.





## యూరియా తిప్పలు.. క్యూలైన్‌లో చెప్పులు, ఖాళీ మద్యం సీసాలు

తెలంగాణలో యూరియా కోసం రైతుల తిప్పలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక్క బస్తా కోసం తిండీ తిప్పలు మాని క్యూలైన్లలో పడరానిపాట్లు పడుతున్నారు. ఎరువులు వచ్చాయని తెలిస్తే చాలు పెద్ద సంఖ్యలో అన్నదాతలు సహకార సంఘాలు, ఆగ్రో కేంద్రాలకు తరలిసవస్తున్నారు. క్యూలైన్లలో చెప్పులు, పాస్ పుస్తకాలు, కట్టెలు, రాళ్లు పెట్టి తమ వంతు కోసం వేచిచూస్తున్నారు. ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రాపురంలో యూరియా కోసం రైతులు తమ చెప్పలతో పాటు ఖాళీ మద్యం సీసాలను క్యూ లైన్‌లో ఉంచారు. యూరియా కొరత రైతులకు ప్రాణసంకటంగా మారింది. ఒక్క యూరియా బస్తా కోసం రైతులు తమ ప్రాణాలు కోల్పోతున్న దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. పంటలకు ప్రాణం పోయాల్సిన యూరియా.. కాంగ్రెస్ సర్కారు తీరుతో రైతుల ప్రాణాలు బలిగొంటున్నది. మరికొన్నిచోట్ల యూరియా కోసం జరిగిన తోపులాటల్లో రైతుల కాళ్లు, చేతులు విరిగిపోతున్నాయి. తలలు పగులుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, యూరియా కొరత పచ్చని పల్లెల్లో చిచ్చు రేపుతున్నది. అన్నదమ్ముల్లాంటి రైతుల మధ్య అగ్గిరాజేస్తున్నది. ఎప్పుడూ కలిసి మెలిసి ఉండే రైతులు యూరియా కోసం తన్నుకొనే పరిస్థితి ఏర్పడింది. యూరియా కొరత కుటుంబాల్లోనూ చిచ్చు పెడుతున్నది. భార్యభర్తలు, తండ్రీ కొడుకుల మధ్య గొడవలకు కారణమవుతున్నది. ఇప్పటివరకు మీడియా సమాచారం మేరకు ఐదుగురు రైతులు యూరియా కొరత కారణంగా మరణించారు. ఈ సంఖ్య ఎక్కువగానే ఉండొచ్చని భా విస్తున్నారు. యూరియా కోసం వెళ్తూ రోడ్డు ప్ర మాదంలో మరణించిన వారు కొందరైతే.. యూ రియా పెట్టిన చిచ్చు కారణంగా తలెత్తిన గొడవల్లో మరణించిన వారు మరికొందరు. క్యూలైన్లలో నిల్చోలేక కొంతమంది రైతులు సొమ్మసిల్లి పడిపోతుంటే.. క్యూలైన్లలో జరిగిన తోపులాటల్లో మరికొందరు రైతులు గాయపడ్డారు.

## 3వ రోజు ఏపీ అసెంబ్లీ సమావేశాలు

### ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో నేడు వ్యవసాయ రంగంపై కీలక ప్రకటన

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మూడో రోజు సమావేశాలు ప్రారంభమయ్యాయి. శాసనసభలో స్పీకర్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రశ్నోత్తరాల అనంతరం పలు కీలక బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. ఎస్సీ వర్గీకరణ బిల్లు, అబ్కారీ చట్ట సవరణ బిల్లు, ఇతర నోటిఫికేషన్లు, వార్షిక నివేదికలు సభ ముందుకు రానున్నాయి.

ప్రవేశపెట్టనున్న ముఖ్య బిల్లులు:

మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయులు ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. మంత్రి కొల్లు రవీంద్ర అబ్కారీ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఏపీ పర్యావరణ నిర్వహణ సంస్థ, హస్తకళల అభివృద్ధి సంస్థ, గృహ నిర్మాణ సంస్థ వార్షిక నివేదికలు, అత్యవసర నిర్వహణ చట్టం నోటిఫికేషన్, బీమా వైద్య సేవల నోటిఫికేషన్, కార్మిక-కర్మాగారాల నోటిఫికేషన్, అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ వార్షిక నివేదిక సభలో ప్రవేశపెట్టనున్నారు.

వ్యవసాయ రంగంపై లఘు చర్చ

వ్యవసాయ రంగంపై లఘు చర్చ జరగనుండగా, ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేయనున్నారు. కాగా, మరోవైపు జీఎస్టీ సంస్కరణలపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మండలిలో ప్రకటన చేయనున్నారు.

## సిందూర్ పార్ట్-2 పాక్ తీరుపై ఆధారపడి ఉంటుంది




సిందూర్ పార్ట్ ౨.. పాక్ తీరుపై ఆధారపడి ఉంటుందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని తెలిపారు. కేవలం తాత్కాలికంగానే నిలిపివేశామని చెప్పారు. పాక్ ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తే.. ఆ దేశానికి తగిన విధంగా బదులిస్తామని హెచ్చరించారు. మొరాకో పర్యటనలో భాగంగా అక్కడి ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. అనంతరం ఆయన ఇవాళ(సోమవారం) మీడియాతో మాట్లాడారు.. ఉగ్రవాదులకు మద్దతిస్తోన్న పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పామని రాజ్‌నాథ్‌సింగ్ గుర్తు చేశారు. ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి మతం అడిగి మరీ పౌరులను చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మతం చూసి వారిని మట్టుబెట్టలేదు. వారు చేసిన పనులు చూసి చంపేశామని స్పష్టం చేశారు. పహల్గాం ఘటన తర్వాత త్రివిధ దళాల అధిపతులతో సమావేశం జరిగినట్లు చెప్పారు. ఆ సమావేశంలో తను ఒకే ఒక ప్రశ్న అడిగినట్లు చెప్పకొచ్చారు. ఒకవేళ ప్రభుత్వం ఆమోదం తెలిపితే.. ఆపరేషన్‌కు మీరు సిద్ధమా..? అని ప్రశ్నించానని చెప్పారు. వారు నిమిషం ఆలస్యం చేయకుండా సిద్ధంగా ఉన్నామని చెప్పారని హర్షం వ్యక్తం చేశారు.

## వీఆర్వోతో గుంజీలు తీయించిన లేడీ ఆఫీసర్



శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఆర్డీవో సువర్ణపై మూకుమ్మడిగా కలెక్టర్‌కు కంప్లైంట్ ఇచ్చారు వీఆర్వోలు. ఆధార్ అప్డేట్ విషయంలో వెనకబడ్డారంటూ వీఆర్వోతో గుంజీలు తీయించారంటూ ఫిర్యాదు చేశారు. పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయంలో ఆధార్ అప్డేషన్‌పై వీఆర్వోలకు ప్రత్యేక శిక్షణ ప్రోగ్రామ్ జరిగింది. ఈ ట్రైనింగ్ సెషన్‌లో ఒడిసి మండలం వీఆర్వోపై మండిపడ్డారు ఆర్డీవో సువర్ణ. ఆధార్ అప్డేట్‌లో బాగా వెనకబడ్డారంటూ ఫైర్ అయ్యారు. ఆర్డీవో సువర్ణ అడిగిన ప్రశ్నలకు వీఆర్వో సమాధానం ఇచ్చాడు. ఆధార్ అప్డేషన్ జరగకపోవడానికి కారణాలను వివరించాడు. చాలామంది బెంగళూరుకు వలస వెళ్లారని.. వాళ్లు వచ్చేంతవరకూ ఆధార్ అప్డేషన్ చేయలేమంటూ ఆర్డీవోకి సమాధానం ఇచ్చాడు వీఆర్వో.. అంతే, ఆర్డీవో సువర్ణకు సర్రున కోపమొచ్చింది. ఎప్పుడూ ఒకే కారణం చెబుతూ తప్పించుకుంటావా అంటూ సువర్ణ మండిపడ్డారు.. అంతటితో ఆగకుండా, ఆధార్ అప్డేషన్‌లో వెనకబడినందుకు గుంజీలు తీయాలంటూ ఆర్డీవో సువర్ణ ఆదేశించారు. ఆర్డీవో ఆర్డర్ వేయడంతో చేసేదేమీలేక.. మిగతా వీఆర్వోల ముందే గుంజీలు తీశాడు. దాంతో, అక్కడున్న వీఆర్వోలందరూ ఆర్డీవో సువర్ణపై ఎదురుతిరిగారు. ఏంటీ నియంతృత్వ పోకడ అంటూ ఆమెతో వాగ్వాదానికి దిగారు. గుంజీలు తీయించడం సరికాదంటూ ఆర్డీవోకు సూచించారు. గుంజీలు తీయించడం ఆపాలని విజ్ఞప్తిచేశారు. ఎంత విన్నవించుకున్నా, ఎంతమంది చెప్పినా వినకుండా వీఆర్వోతో గుంజీలు తీయించారు ఆర్డీవో. దాంతో, ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు వీఆర్వోలు. తమను అవమానించారంటూ ఆర్డీవో సువర్ణపై కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మొత్తం ఘటనపై విచారణ జరిపి, ఆర్డీవో సువర్ణపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు వీఆర్వోలు..

## స్వల్ప నష్టాలతో స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు (సెప్టెంబర్ ౨౨, ౨౦౨౫) నష్టాలతో ప్రారంభమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 150 పాయింట్లు పడిపోయి 82,151 స్థాయిలో ఉండగా, నిఫ్టీ 8౨ పాయింట్లు తగ్గి ౨5,౨38 పరిధిలో ట్రేడ్ అవుతోంది. అమెరికా కొత్తగా హెచ్-1బీ వీసాలకు $100,000 ఒకేసారి ఫీజు విధించడంతో భారత ఐటీ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. ప్రధానంగా టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌ఎస్‌ఎల్ టెక్నాలజీస్ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో SBI లైఫ్ ఇన్సురెన్స్, హీరో మోటో కార్పొరేషన్, ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, హిందాల్కో వంటి కంపెనీల షేర్లు టాప్ 5 లాభాల్లో ఉన్నాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ సూచీ 3% పడిపోయింది. మిడ్‌స్మాల్ ఐటీ, టెలికాం రంగాలు 1.75% తగ్గాయి. ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు స్వల్ప నష్టాల్లో ఉన్నాయి.ఆటో, మీడియా, మెటల్ రంగాలు లాభాల్లో ఉన్నాయి. మెయిన్‌బోర్డ్ విభాగంలో iValue ఇన్ఫోసొల్యూషన్స్ ఇష్యూ ఈరోజు ముగుస్తుంది. GK ఎనర్జీ, సాత్విక్ గ్రీన్ ఎనర్జీ IPOలు రెండో రోజులోకి ప్రవేశిస్తాయి. అట్లాంటా ఎలక్ట్రికల్స్, గణేష్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఇష్యూలు ఈరోజు సబ్‌స్క్రిప్షన్ కోసం రాబోతున్నాయి. SME విభాగంలో టెక్‌డి సైబర్ సెక్యూరిటీ లిస్టింగ్‌తో సహా నాలుగు ఇష్యూలు ఈరోజు సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉన్నాయి.

## బికినీలో తళుక్కుమన్న సాయి పల్లవి..?

సాధారణంగా హీరోయిన్స్ బికినీ వేయడం అనేది కామన్. ఈ రోజుల్లో చాలా మంది హీరోయిన్స్ విదేశాలకి వెళ్లినప్పుడు, బీచ్ ప్రాంతాలలో ఎంజాయ్ చేయడానికి వెళ్లినప్పుడు బికినీ వేసి సందడి చేస్తుండడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే వెండితెరపై పద్ధతిగా కనిపించే భామలు ఒక్కసారి బికినీలో కనిపిస్తే ప్రేక్షకులతో పాటు వారి అభిమానులు షాక్ అవ్వడం గ్యారెంటీ. తాజాగా మలయాళ ముద్దుగుమ్మ సాయి పల్లవి బికినీలో కనిపించి పెద్ద షాక్ ఇచ్చింది. సాయి పల్లవి సినిమాల్లో ఎప్పుడూ సింపుల్‌గా, గ్లామర్‌కి దూరంగా కనిపించే హీరోయిన్‌గా పేరు సంపాదించారు. మంచి నటన, సున్నితమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ఆమెను అభిమానులు 'నేచురల్ బ్యూటీ'గా అభిమానిస్తారు. ఇలాంటి సాయి పల్లవి తాజాగా బికినీలో కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలు ఆమె తన చెల్లెలు పూజా కన్నన్‌తో కలిసి విదేశాల్లో వెకేషన్ ఎంజాయ్ చేస్తున్నప్పుడు తీసినవని తెలుస్తోంది. బీచ్‌లో జలక్రీడల్లో పాల్గొన్న సాయిపల్లవి బికినీలో కనిపించడం నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేసింది. ఎప్పుడూ సంప్రదాయ లుక్‌లో కనిపించే సాయిపల్లవి ఇలా బోల్డ్‌గా కనిపించడం కొంతమందిని షాక్‌కు గురిచేసింది. "సాయి పల్లవి బికినీలోనా? నమ్మలేకపోతున్నాం!", "ఇదేంటి.. ఇంతవరకు పద్ధతిగా కనిపించిన పల్లవి ఇలా మారిపోతుందని ఊహించలేదు" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

